క్లుప్తంగా

ఇంటింటి సర్వే పకడ్బందీగా నిర్వహించాలి



పెంచికలపాడులో ఇంటింటి సర్వేను పరిశీలిస్తున్న తహసీల్దార్ శివశంకర్‌నాయక్

గూడూరు రూరల్: బీఎల్‌ఓలు గ్రామాల్లో చేపట్టిన ఇంటింటి సర్వేను పకడ్బందీగా నిర్వహించాలని తహసీల్దార్ శివశంకర్‌నాయక్ సూచించారు. పెంచికలపాడులో జరుగుతున్న సర్వేను ఆదివారం ఆయన పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ ఓటరు జాబితాలో మార్పులు, చేర్పులను చేసేందుకు, అనర్హులు ఉంటే తొలగించేందుకు బీఎల్‌ఓల ద్వారా ఇంటింటి సర్వేను జరుపుతున్నామన్నారు. ప్రజల సహకరించి ఏవైనా మార్పులు, చేర్పులు ఉంటే సరి చేసుకోవాలని సూచించారు.

కేసీ కాల్వకు 221 క్యూసెక్కుల విడుదల

గూడూరు: సుంకేసుల జలాశయం నుంచి కేసీ కాల్వకు 221 క్యూ సెక్కుల నీరు విడుదల చేసినట్లు ఆదివారం డ్యామ్ అధికారులు తెలిపారు. జలాశయానికి ఇన్‌ఫ్లో నిలిచి పోయిందని, ప్రస్తుతం 0.881 టీఎంసీల నిల్వ ఉన్నట్లు పేర్కొన్నారు.

రేపటి నుంచి ఆధార్ అప్‌డేట్ క్యాంపులు

కల్లూరు: పదేళ్లు అయినా ఒక్కసారి కూడా ఆధార్ కార్డు అప్‌డేట్ చేసుకోని వారు గ్రామ/వార్డు సచివాలయాల్లో అప్‌డేట్ చేసుకోవాలని ఎంపీడీఓ జీవీ రమణమూర్తి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 22, 23, 24, 25 తేదీల్లో సచివాలయాల్లో ఆధార్ క్యాంపులు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. మండలంలోని ప్రజలు ఆధార్ కార్డు అప్‌డేట్ క్యాంపులను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

గ్రంథాలయాల అభివృద్ధికి విశేష కృషి

కర్నూలు కల్చరల్: జిల్లా కేంద్ర గ్రంథాలయ సంస్థలో ఆదివారం పాతూరి నాగభూషణం 117వ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. గ్రంథాలయ సంస్థ డిప్యూటీ లైబ్రేరియన్ పెద్దక్క మాట్లాడుతూ గ్రంథాలయాల అభివృద్ధికి పాతూరి నాగభూషణం విశేష కృషి చేశారన్నారు. విజయవాడలో గ్రంథాలయ శిక్షణ కేంద్రాన్ని ఏర్పాటు చేసి అనేక మంది లైబ్రేరియన్లను తయారు చేశారని గుర్తు చేశారు. కార్యక్రమంలో గ్రంథాలయ ఉద్యోగులు గోవిందరెడ్డి, బాషా, పాఠకులు తదితరులు పాల్గొన్నారు.

అలరించిన సంగీత విభావరి

కర్నూలు కల్చరల్: నగర శివారులోని గోదా గోకులంలో ఆదివారం నిర్వహించిన భక్తి సంగీత విభావరి అలరించింది. హైదరాబాద్‌కు చెందిన ప్రముఖ గాయని బుర్రా హేమ మాలినిచే నిర్వహించిన విభావరిలో వయోలిన్ సహకారం రాధశ్రీ లాస్య, మృదంగం బి.సుధాకర్ అందించారు. త్యాగరాజు కృతులు, అన్నమయ్య కృతులతో పాటు రామదాసు కృతులను ఎంతో హృద్యంగా ఆలపించి ఆహూతులను మంత్రముగ్ధులను చేశారు. కార్యక్రమంలో గోదా గోకులం వ్యవస్థాపక అధ్యక్షుడు మారం నాగరాజు గుప్త, మేనేజింగ్ ట్రస్టీ పల్లెర్ల నాగరాజు, సభ్యులు పాలాది సుబ్రహ్మణ్యం, బాల సుధాకర్, జనార్దన, వెంకటకృష్ణ, వీరయ్య, రవి, శ్రీనివాస్, లలిత, వేదవతి, సునీత, తిరుమల తిరుపతి దేవ స్థానములు హిందూ ధర్మ ప్రచార పరిషత్ జిల్లా కార్యనిర్వాహకులు మల్లు వెంకటరెడ్డి, వివిధ ధార్మిక సంస్థల ప్రతినిధులు, భక్తులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి చెస్ పోటీల్లో విద్యార్థినుల ప్రతిభ

కర్నూలు (న్యూసిటీ): నగరంలోని సంకల్‌బాగ్ భాష్యం పాఠశాలలో ఆదివారం నిర్వహించిన రాష్ట్రస్థాయి చెస్ పోటీల్లో విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. ఓపెన్ కేటగిరీ విభాగంలో మూల సహస్ర లక్ష్మి, ఎం. హేమమన్య, కె. సమన్విత మొదటి మూడుస్థానాల్లో విజయం సాధించారు. ఆంధ్ర చెస్ అసోసియేషన్, ఆల్ కర్నూలు చెస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ పోటీలు నిర్వహించారు. విజేతలకు ముఖ్య అతిథిగా వచ్చిన ఆర్థోపెడిక్ సర్జన్ డాక్టర్ ఎస్. కిరణ్‌కుమార్ మెమెంటో, ప్రశంసాపత్రం అందజేసి అభినందించారు. కార్యక్రమంలో చెస్ అసోసియేషన్ నాయకులు కోవింద జియ్యర్, రామసుబ్బారెడ్డి, టోర్నమెంట్ ఆర్గనైజర్లు స్వాతి, డైరెక్టర్ నందకిశోర్ పాల్గొన్నారు.

ఆరుగురు బీఎల్‌ఓల సస్పెన్షన్

కర్నూలు (టౌన్): విధుల పట్ల నిర్లక్ష్యం ప్రదర్శించిన ఆరుగురు బీఎల్‌ఓలను (బూత్ లెవల్ ఆఫీసర్లను) నగరపాలక కమిషనర్ భార్గవ్‌తేజ సస్పెండ్ చేశారు. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు నగరంలో ప్రతి పోలింగ్ బూత్ పరిధిలో ఓటర్ల గుర్తింపు సర్వే చేస్తున్నారు. అయితే సర్వే పట్ల అలసత్వం ప్రదర్శించడం, సర్వే చేపట్టడంలో అంతులేని నిర్లక్ష్యం ప్రదర్శించిన సచివాలయాల ఉద్యోగులు (బీఎల్‌ఓలు) నాగర్జున, నీలి నాగరాజు, హుస్సేన్, కిరణ్మయి, ఎం.రాజు, నరేష్‌లను కమిషనర్ సస్పెండ్ చేస్తు ఆదివారం ఉత్తర్వులు జారీ చేశారు.

పంచాయతీ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ ప్రభంజనం

- కోడుమూరు ఎమ్మెల్యే డాక్టర్ సుధాకర్
- టీడీపీ నాయకులు, ఎల్లో మీడియా గెలిచినట్లు ప్రచారం చేయడం దుర్మార్గం
- 40 ఏళ్లలో టీడీపీ నేతలు చేసిన అభివృద్ధి ఏంటో సమాధానం చెప్పాలని సవాల్ విసిరిన ఎమ్మెల్యే



సమావేశంలో మాట్లాడుతున్న కోడుమూరు ఎమ్మెల్యే డాక్టర్ సుధాకర్

కర్నూలు (న్యూటౌన్): ఏపీలో జరిగిన 66 సర్పంచ్ స్థానాలకు ఎన్నికలు జరిగితే 30 సర్పంచ్‌లు వైఎస్సార్‌సీపీ మద్దతుదారులు ఏకగ్రీవంగా గెలవగా, 23 స్థానాల్లో జరిగిన ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ మద్దతుదారులు ప్రభంజనం సృష్టించారని కోడుమూరు ఎమ్మెల్యే డాక్టర్ జరదొడ్డి సుధాకర్ అన్నారు. కర్నూలు నగరంలోని స్టాంటన్‌పురం వైఎస్సార్‌సీపీ కోడుమూరు నియోజకవర్గ కార్యాలయంలో ఆదివారం సాయంత్రం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడారు. ఎన్నికల సంఘం ఎంతో స్పష్టంగా పంచాయతీ ఎన్నికల ఫలితాలను వెల్లడిస్తే టీడీపీ నేతలు, ఎల్లో మీడియా గెలిచినట్లు పిచ్చిరాతలు రాసి ప్రచారం చేయడం దుర్మార్గమైన చర్య అని విమర్శించారు. ఏపీలో 1062 వార్డు మెంబర్ స్థానాలు ఉండగా 726 వార్డు స్థానాల్లో వైఎస్సార్‌సీపీ మద్దతుదారులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారని వెల్లడించారు. వార్డులకు సంబంధించి 149 స్థానాల్లో వైఎస్సార్‌సీపీ మద్దతుదారులు విజయం సాధించారని అన్నారు. టీడీపీ మద్దతుదారులు 90, జనసేన మద్దతుదారులు 4 గెలిచారన్నారు. కోడుమూరు నియోజకవర్గంలో 9 వార్డు స్థానాలకు గానూ గూడూరు మండలంలో 2, కర్నూలు మండలంలో 2 స్థానాలు మొత్తం 4 స్థానాల్లో వైఎస్సార్‌సీపీ మద్దతుదారులు ఏకగ్రీవం అయ్యారని స్పష్టం చేశారు. కేవలం కె నాగలాపురం, ఆర్‌కే దుద్యాలలో 2 స్థానాల్లో టీడీపీ మద్దతుదారులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారన్నారు. మల్లాపురం, మునగాల, జి సింగవరం, దిగువపాడులో వైఎస్సార్‌సీపీ మద్దతుదారులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారని వివరించారు. ఉల్పాలలో 105, ప్యాలకుర్తిలో 72 ఓట్లతో వైఎస్సార్‌సీపీ మద్దతుదారులు విజయం సాధించారని అన్నారు. కేవలం గోరంట్లలో 22 ఓట్ల తేడాతో టీడీపీ మద్దతుదారులు గెలిచారని అన్నారు. పంచాయతీ ఎన్నికల్లో ప్రజలు టీడీపీ మద్దతుదారులను ఘోరంగా ఓడగొట్టారని అన్నారు.

కెమెరా ఆన్ అంటేనే... పవన్ కల్యాణ్ నటిస్తాడు..

సినిమాల్లో కెమెరా ఆన్ అంటేనే జనసేన అధ్యక్షుడు పవన్ కల్యాణ్ నటిస్తారని, అదేవిధంగా పబ్లిక్ మీటింగ్‌లలోనూ ఎవరూ రాసిచ్చిన స్క్రిప్ట్‌ను ఆవేశంతో చదివి వెళ్లిపోవడం తప్పా ప్రజలకు చేసిందేమీ లేదని విమర్శించారు. రాబోయే 2024 ఎన్నికల్లో 175కు 175 స్థానాల్లో వైఎస్సార్‌సీపీ గెలుపు తథ్యమన్నారు. సమావేశంలో జెడ్పీటీసీ ప్రసన్నకుమార్, సొసైటీ చైర్మన్ వినయ్‌కుమార్‌రెడ్డి, వ్యవసాయ సలహా మండలి అధ్యక్షులు వెంకటేశ్వర్‌రెడ్డి, కార్పొరేటర్ సాంబ, మండల మాజీ ఉపాధ్యక్షులు వాసు, సర్పంచ్ విద్యాసాగర్, సచివాలయ కన్వీనర్లు వెంకటేశ్వర్‌రెడ్డి, మోహన్‌బాబు, గోపాల్, సుంకన్న, సంపత్‌కుమార్, భాస్కర్, సురేష్, చిన్న లక్ష్మన్న, మాజీ సర్పంచ్ ఏసేపు పాల్గొన్నారు.

పాణ్యం నియోజకవర్గంలో గెలుపొందిన వార్డు మెంబర్లు



రాచమల్లు అపర్ణ కొండజుటూరు, ముల్ల షంషాద్, కొలురు, లక్ష్మీదేవి 9వార్డు, దుర్వేశి బి.మహానంది పర్ల, పి. శేఖర్ 5వార్డు, పర్ల మారం సతీష్ ఓర్వకల్లు, కొట్టాల మద్దమ్మ బ్రహ్మనపల్లి, కె. విజయలక్ష్మి చింతలపల్లి, బోయ రమణమ్మ శకునాల, కురువ లక్ష్మీదేవి కేతవరం, జి. లక్ష్మీదేవి ఉలిందకొండ

కోడుమూరు, కర్నూలు, గూడూరు మండలాల్లో ఉప ఎన్నికల్లో ఏకగ్రీవంగా, పోటీల్లో గెలిచిన అభ్యర్థులు



సుశీలమ్మ, ప్యాలకుర్తి; రాధాకృష్ణమ్మ, ఉల్పాల; కురువ రాణి, జి.సింగవరం; వడ్డె వెంకటలక్ష్మమ్మ, దిగువపాడు; సుభాన్ బాషా, ఆర్కే.దుద్యాల; లాలమ్మ, గోరంట్ల; సరోజ, మునగాల; లక్ష్మీదేవి, మల్లాపురం; బండారి పావని, కె.నాగులాపురం

తీరనున్న లోఓల్టేజీ సమస్య!

- చిల్లబండ వద్ద రూ.2కోట్లతో విద్యుత్ సబ్ స్టేషన్ నిర్మాణం
- నెలాఖరులోగా ప్రారంభించేందుకు ఏర్పాట్లు



చిల్లబండ గ్రామం వద్ద రూ.2కోట్లతో నిర్మిస్తున్న విద్యుత్ సబ్ స్టేషన్

కోడుమూరు రూరల్ : మండలంలోని అమడగుంట్ల, చిల్లబండ, ఎర్రదొడ్డి, అనుగొండ, వెంకటగిరి గ్రామాల్లో నిత్యం తలెత్తే లోఓల్టేజీ తదితర కరెంట్ సమస్యలు పరిష్కారం కానున్నాయి. ప్రభుత్వం రూ.2కోట్లతో చిల్లబండ గ్రామం వద్ద నూతన విద్యుత్ సబ్‌స్టేషన్ నిర్మాణాన్ని చేపట్టింది. ఈ విద్యుత్ సబ్ స్టేషన్ నిర్మాణ పనులు దాదాపు ముగింపు దశకు చేరుకున్నాయి. ఈనెలాఖరులోగా విద్యుత్ సబ్‌స్టేషన్‌ను ప్రారంభించేందుకు విద్యుత్ అధికారులు అన్ని చర్యలు తీసుకుంటున్నారు. విద్యుత్ సబ్ స్టేషన్ ప్రారంభమైతే ఐదు గ్రామాలకు విద్యుత్ సమస్య ఉండదు. నిరంతరం కరెంట్‌ను సప్‌లై చేయడంతో పాటు, వ్యవసాయానికి సంబంధించిన బోర్లకు కూడా లోఓల్టేజీ సమస్య తలెత్తదు. ఈ గ్రామాలకు ప్రస్తుతం లద్దగిరి సబ్‌స్టేషన్ ద్వారా కరెంట్‌ను సప్‌లై చేస్తున్నామని, చిల్లబండ సబ్‌స్టేషన్ పనులను నెలాఖరుకు పూర్తి చేసి అందుబాటులోకి తెస్తామని కోడుమూరు ఏఈ ఇస్మాయిల్ తెలిపారు.

మూడు వార్డు స్థానాలు ఏకగ్రీవం



కురువ రాణి, జి సింగవరం; వడ్డె వెంకటలక్ష్మమ్మ దిగువపాడు

కర్నూలు (న్యూటౌన్): కర్నూలు మండలం జి సింగవరంలో 2వ వార్డు వైఎస్సార్‌సీపీ మద్దతుదారురాలు కురువ రాణి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అదేవిధంగా దిగువపాడు 8వ వార్డుకు వడ్డె వెంకటలక్ష్మీ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అలాగే ఆర్‌కే దుద్యాల గ్రామంలోని 4వ వార్డుకు టీడీపీ మద్దతుదారుడు షేక్ సుభాన్‌బాషా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఉల్పాల గ్రామంలోని 11వ వార్డు స్థానానికి ఎన్నికలు నిర్వహించగా వైఎస్సార్‌సీపీ మద్దతుదారురాలు రాజోలి రాధా కృష్ణమ్మ 105 ఓట్ల మెజారిటీతో గెలుపొందారు.

వైఎస్సార్‌సీపీ అభివృద్ధికి కృషి చేయండి



నాయకులతో సమావేశమైన మండల కన్వినర్ సోమశేఖర్‌రెడ్డి

సి.బెళగల్: వైఎస్సార్‌సీపీ అభివృద్ధికి నాయకులు, ప్రజా ప్రతినిధులు, కార్యకర్తలు, అభిమానులు అంకితభావంతో కృషి చేయాలని పార్టీ మండ కన్వీనర్ సోమశేఖర్ రెడ్డి పిలుపునిచ్చారు. ఆదివారం ఆయన మండల కేంద్రం సి.బెళగల్‌లో నాయకులు, కార్యకర్తలతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. గ్రామాలలో కార్యకర్తలు ప్రజలకు అందుబాటులో ఉండి వారి అవసరాలు, సమస్యలను పార్టీ పెద్దల దృష్టికి తీసుకురావాలని అన్నారు. అదేవిధంగా పార్టీ మద్దతుతో గెలిచిన ప్రజా ప్రతినిధులు ప్రజల సంక్షేమం అభివృద్ధి, పార్టీ బలోపేతానికి పాటుపడాలన్నారు. సమావేశంలో మాజీ కన్వీనర్ నరసింహుడు, వైఎస్సార్‌సీపీ మండల కార్యదర్శులు ముందరింటి వెంకటేష్, బుల్లెట్ పులిరాజు, శంకర్ రెడ్డి, నాగేశ్వరరెడ్డి, రాజశేఖర్‌రెడ్డి, మండల కోఆప్షన్ మెంబర్ హారున్, బ్రాహ్మణదొడ్డి, సి.బెళగల్, ఇనగండ్ల గ్రామ సర్పంచ్‌లు దస్తగిరి, పాండురంగన్న, ఇమ్మానియేల్, ఈర్లదిన్నె ఎంపీటీసీ సభ్యుడు నడిపి సోమన్న, కొండాపురం ఉప సర్పంచ్ సుంకన్న, నాయకులు రాఘవేంద్ర, గోవర్ధన్‌రెడ్డి, ఈరన్న, బాలరాజు, ఈశ్వరయ్య తదితరులు పాల్గొన్నారు.

సస్యరక్షణపై రైతులకు అవగాహన పెంచండి

- నంద్యాల జిల్లా ఏరువాక కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త రామకృష్ణారావు



ఇన్‌పుట్ డీలర్ల సమావేశంలో మాట్లాడుతున్న శాస్త్రవేత్త రామకృష్ణారావు

కర్నూలు(అగ్రికల్చర్): వివిధ పంటల్లో చేపట్టే సమగ్ర సస్యరక్షణ పద్ధతులు పాటించడంలో రైతులు తగిన జాగ్రత్తలు పాటించే విధంగా అవగాహన కల్పించాలని నంద్యాల ఏరువాక కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త ఏ.రామకృష్ణారావు సూచించారు. ఆదివారం కలెక్టరేట్‌లోని వ్యవసాయ శాఖ సెమినార్ హాల్‌లో దేశీ డిప్లొమ కోర్సుకు సంబంధించి ఇన్‌పుట్ డీలర్లకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. దేశీ కోర్సు సమన్వయకర్త, విశ్రాంత జేడీఏ డి.జయచంద్ర ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ... డీలర్లు సమగ్ర సస్యరక్షణ పద్ధతులపై అవగాహన పెంచుకోవాలని తెలిపారు. రైతులు రసాయన ఎరువులు, పురుగుమందుల కోసం మీ దగ్గరకే వస్తుంటారని, వారికి తగిన సలహాలు, సూచనలు ఇచ్చి సహకరించాలని చెప్పారు. రైతులు సస్యరక్షణ పద్ధతులు పాటించడంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను కూడా వివరించారు. పిచికారీలో మోతాదుకు మించి పురుగుమందులు వినియోగించడం వల్ల కలిగే అనర్థాలను వివరించారు. రసాయనిక పురుగుమందులను పూత మందులు, సూక్ష్మధాతువులతో కలిపి పిచికారీ చేయరాదని తెలిపారు. విశ్రాంత జేడీఏ జయచంద్ర మాట్లాడుతూ... రసాయన ఎరువులు, పురుగుమందుల వాడకం తగ్గించాల్సిన అవసరం ఉందన్నారు. వ్యవసాయ అధికారులు, శాస్త్రవేత్తల సిఫారస్సుల మేరకే పిచికారీ చేసే విధంగా చూడాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో 40 మంది ఇన్‌పుట్ డీలర్లు పాల్గొన్నారు.

30న నగర పాలక సర్వసభ్య సమావేశం

కర్నూలు (టౌన్) : ఈనెల 30 న స్థానిక నగర పాలక నూతన కౌన్సిల్ హాలులో నగర పాలక సర్వసభ్య సమావేశం జరుగనుంది. నగర మేయర్ అధ్యక్షతన నిర్వహించనున్న ఈ సమావేశంలో పాలక వర్గ సభ్యులు, అధికారులు హాజరు కానున్నారు. పలు అభివృద్ధి అంశాలపై చర్చించి తగు నిర్ణయాలు తీసుకుంటున్నట్లు కార్పొరేషన్ కార్యాలయ వర్గాలు వెల్లడించాయి.

30న భజన మండళ్ల సమ్మేళనం

కర్నూలు కల్చరల్: పవిత్ర శ్రావణ పౌర్ణమిని పురస్కరించుకొని వికాస భారతి ఆధ్వర్యంలో ఈనెల 30వ తేదీన కాల్వబుగ్గ సమీపంలోని సురభి గోశాల ప్రాంగణంలో భజన మండళ్ల సమ్మేళనం నిర్వహిస్తున్నట్లు కార్యక్రమ సమన్వయకర్త పోచా మహేశ్వరరెడ్డి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పూజ్యశ్రీ స్వాత్మానంద సరస్వతి స్వామి వారు ఆశీర్వాద ప్రసంగం చేస్తారని తెలిపారు. ఎన్ని భజన మండళ్లు, ఎంత మంది సభ్యులు వస్తున్నారనే వివరాలు 25వ తేదీలోగా 94932 54266 నంబర్‌కు సమాచారం ఇవ్వాలని కోరారు.

కొత్తూరుకు పోటెత్తిన భక్తులు



పుట్టలో పాలు పోస్తున్న భక్తులు



కొత్తూరులో స్వామి వారి దర్శనం కోసం క్యూలైన్‌లో వేచి ఉన్న భక్తులు

పాణ్యం: మండలంలో నాగులచవితి పర్వదినాన్ని ఆదివారం భక్తులు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. నాగుల కట్ట, పుట్టల వద్ద పూజలు చేశారు. పాలు పోసి ముక్కులు తీర్చుకున్నారు. ప్రత్యేకించి కొత్తూరు గ్రామంలో వెలసిన శ్రీవల్లి సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయానికి భక్తులు పోటెత్తారు. తెల్లవారుజాము నుంచి భక్తులు పెద్దఎత్తున తరలివచ్చారు. స్వామి వారి దర్శనం కోసం భక్తులు బారులు తీరారు. క్యూలైన్‌లు నిండిపోయి గాలిగోపురం ముందుకు వచ్చింది. స్వామి వారికి తెల్లవారుజామున అర్చకులు అభిషేకాలు, అర్చనలు చేశారు. ప్రత్యేక అలంకారణలో స్వామివారు భక్తులకు దర్శమిచ్చారు. స్వామి వారికి దర్శనానికి సుమారు 3-4గంటలపైనే సమయం పట్టింది. తెల్లవారుజాము నుంచి మధ్యాహ్నం 3గంటల వరకు క్తులతో కొత్తూరు కిటకిటలాడింది.

గడివేముల: మండలంలో ఆదివారం నాగులచవితి పండుగ వేడుకలు కుటుంబ సమేతంగా మహిళలు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. ప్రముఖ శైవ క్షేత్రమైన భోగేశ్వరాలయంతో పాటు శివాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. ఆయా గ్రామాల్లో నాగేంద్రుడి పుట్టలో పాలుపోసిన భక్తులు కోడిగుడ్లను వదిలి మొక్కులు చెల్లించారు.



కొత్తూరులో నాగుల కట్ట వద్ద భక్తులు సందడి



పాణ్యంలోని బస్టాండ్‌లో పుట్ట వద్ద పూజలు చేస్తున్న భుక్తులు



ప్రత్యేక అలంకారంలో శ్రీ వల్లి సుబ్రహ్మణ్యేశ్వర స్వామి

హ్యాండ్‌బాల్ పోటీల్లో జిల్లా జట్టు ప్రతిభ

ఒంగోలు: హ్యాండ్‌బాల్ రాష్ట్ర స్థాయి పోటీల్లో కర్నూలు జట్టు సత్తాచాటింది. పురుషుల విభాగంలో రెండో స్థానంలో నిలిచింది. ఒంగోలులోని మినీ స్టేడియంలో ఆదివారం రాష్ట్రస్థాయి 9వ పురుషుల హ్యాండ్‌బాల్ టోర్నమెంట్ ఫైనల్‌మ్యాచ్ జరిగింది. ఈ పోటీలో విశాఖ జట్టు ప్రథమ స్థానాన్ని కై వసం చేసుకోగా, కర్నూలు జట్టు ద్వితీయ స్థానంలో నిలిచింది. ఆతిథ్య ప్రకాశం జట్టు తృతీయస్థానంతో సరిపెట్టుకుంది. ఈ పోటీల్లో ప్రతిభ కనబరిచిన క్రీడాకారులతో రాష్ట్ర జట్టును ప్రకటించారు. ఎంపికైన క్రీడాజట్టు సెప్టెంబర్ 1 నుంచి 7వ తేదీ వరకు జమ్మూ కాశ్మీర్‌లో జరిగే జాతీయ పోటీల్లో ఆంధ్రప్రదేశ్ తరఫున ప్రాతినిధ్యం వహిస్తుంది. అనంతరం పోటీల ముగింపు కార్యక్రమంలో భాగంగా హ్యాండ్‌బాల్ అసోసియేషన్ జాయింట్ సెక్రటరీ జె.కోటేశ్వరరావు, పి.విజయలక్ష్మి, ఫిజికల్ డైరెక్టర్ వై.శీనయ్య, పి.విజయ్‌కుమార్, సత్యం, గురుప్రసాద్ తదితరులు పాల్గొని విజేత జట్లకు ట్రోఫీలు అందించారు.

20 నుంచి క్రీడా సంబరాలు

కర్నూలు (న్యూసిటీ) : క్రీడా సంబరాలు ఈ నెల 20 నుంచి 29వ తేదీ వరకు నిర్వహిస్తున్నట్లు ఒలింపిక్ సంఘం అధ్యక్షుడు రామాంజనేయులు తెలిపారు. ఆదివారం స్టేడియంలో కరాటే పోటీలు ని ర్వహించారు. కార్యక్రమంలో జిల్లా ఆర్చరీ అసోసియేషన్ కార్యదర్శి నాగరత్నమయ్య, కరాటే అసోసియేషన్ ప్రతినిధులు రవికుమార్, ఫయాజ్ అహ్మద్, మహమ్మద్ గౌస్, వ్యాయామ ఉపాధ్యాయురాలు గీత పాల్గొన్నారు.

యూనివర్సల్ కరాటే బెల్ట్ గ్రేడింగ్ టెస్ట్

యూనివర్సల్ కరాటే అసోసియేషన్ ఆధ్వర్యంలో జొహరాపురంలోని ఇండోర్ 19 కే షటిల్ బ్యాడ్మింటన్ స్టేడియంలో కరాటే బెల్ట్ గ్రేడింగ్ టెస్ట్ నిర్వహించినట్లు మాస్టర్ టి.శ్రీనివాసులు తెలిపారు. 19కే షటిల్ బ్యాడ్మింటన్ డైరెక్టర్ జాన్ జాకోబ్ మాట్లాడుతూ చిన్నారులు చదువుతోపాటు కరాటే, ఉషూ, మార్షల్ ఆర్ట్స్ నేర్చుకోవాలన్నారు. అనంతరం ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు ఆరంజ్ బెల్టులు అందజేశారు.

వినియోగదారులకు అందుబాటులో ఉండాలి

కర్నూలు(రాజ్‌విహార్): వినియోగదారులకు అందుబాటులో ఉండాలని విద్యుత్ అధికారులను ఆ సంస్థ కర్నూలు ఆపరేషన్స్ ఎస్‌ఈ ఎం. ఉమాపతి ఆదేశించారు. ఆదివారం ఆయన స్థానిక విద్యుత్ భవన్ నుంచి కింద స్థాయి అధికారులతో టెలి కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వివిధ కారణాలతో బ్రేక్ డౌన్స్, ట్రిప్పింగ్స్, ఫ్యూజ్ ఆఫ్ కాల్, ఇతర సాంకేతిక సమస్యలు తలెత్తే అవకాశాలున్నాయని, ఇవి మన దృష్టికి వచ్చిన వెంటనే స్పందించి పరిష్కార చర్యలు చూపాలన్నారు. అయితే పని చేసే చోట ఉంటేనే సమస్య పరిష్కరించడం సులువన్నారు. ప్రజలకు ఇబ్బందుకు గురిచేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

నేడు కొణిదేడులో గడప గడపకు మన ప్రభుత్వం

పాణ్యం: మండల పరిధిలోని కొణిదేడు గ్రామంలో సోమవారం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ దస్తగిరి ఆదివారం తెలిపారు. ఉదయం 8గంటలకు ప్రారంభమయ్యే కార్యక్రమానికి ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి హాజరై గ్రామంలో విస్తృతంగా పర్యటిస్తారన్నారు. అధికారులు, వలంటీర్లు, గ్రామ సచివాలయ సిబ్బంది తప్పకుండా హాజరు కావాలని సూచించారు.

నేడు వర్కూరులో..

కోడుమూరు రూరల్ : మండలంలోని వర్కూరు గ్రామంలో సోమవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ చంద్రశేఖర్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. కార్యక్రమానికి కోడుమూరు ఎమ్మెల్యే డాక్టర్ సుధాకర్ ముఖ్య అతిథిగా హాజరై ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రతి గడపకు వెళ్లి ప్రజలకు వివరిస్తారన్నారు. అదేవిధంగా ప్రజలతో మాట్లాడి సమస్యలు తెలుసుకుని పరిష్కార చర్యలు చేపడుతారన్నారు. అధికారులు, గ్రామ సచివాలయ సిబ్బంది, వలంటర్లు పాల్గొనాలని ఎంపీడీఓ సూచించారు.

నేడు కోడుమూరులో స్పందన

కోడుమూరు రూరల్ : ప్రజా సమస్యల పరిష్కారంలో భాగంగా కోడుమూరులోని తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం స్పందన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ జయన్న ఆదివారం తెలిపారు. కార్యక్రమంలో అన్ని శాఖల అధికారులు పాల్గొంటారని, ప్రజలు ఏవైనా సమస్యలుంటే అర్జీల రూపంలో సమర్పిస్తే వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ పేర్కొన్నారు.

సి.బెళగల్: స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో నిర్వహించే స్పందన కార్యక్రమానికి అధికారులు తప్పనిసరిగా హాజరవ్వాలని తహసీల్దార్ శేషఫణి ఆదివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ప్రజా సమస్యల పరిష్కార వేదిక అయిన స్పందన కార్యక్రమాన్ని మండల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

గూడూరు: స్థానిక రెవిన్యూ కార్యాలయంలో సోమవారం స్పందన కార్యక్రమం నిర్వహిస్తామని తహసీల్దార్ శివశంకర్‌నాయక్ ఒక ప్రకటనలో తెలిపారు. అధికారులు తప్పక హాజరు కావాలన్నారు. సమస్యల పరిష్కారమే లక్ష్యంగా నిర్వహించే స్పందన కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

ఫిజియోథెరపీని సద్వినియోగం చేసుకోండి

సి.బెళగల్: మండలంలోని దివ్యాంగుల ఉపయోగార్థం నిర్వహించే ఫిజియోథెరపీ క్యాంప్‌ను దివ్యాంగులు, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎంఈఓ జ్యోతి ఆదివారం ప్రకటనలో సూచించారు. స్థానిక మండల భవిత కేంద్రంలో ప్రతి సోమవారం దివ్యాంగులకు శారీరక అవయవాలకు వైద్యుడు వీరేష్ ఫిజియోథెరపీ చేస్తారన్నారు. దివ్యాంగులను భవిత కేంద్రానికి తీసుకవచ్చి, వైద్యం చేయించుకోవాలని సూచించారు.

ఆటో బోల్తా ఐదుగురికి గాయాలు

పాణ్యం: మండల పరిధిలోని కొత్తూరు–నందివర్గం గ్రామాల మధ్య జరిగిన రోడ్డు ప్రమాదంలో ఐదుగురికి గాయాలైనట్లు 108 సిబ్బంది తెలిపారు. వివరాల మేరకు బనగానపల్లెకు చెందిన భక్తులు కొత్తూరు సుబ్రహ్మణ్యేశ్వరస్వామిన దర్శించుకుని వస్తుండగా టైర్ పంక్చర్ కావడంతో ఆటో బోల్తాపడింది. ఆటోలో ప్రయాణిస్తున్న లక్ష్మీదేవి, వరుణ్‌కుమారు, పి లక్ష్మీదేవి, శివలక్ష్మీ, డి లక్ష్మీదేవి, ఎస్ లక్ష్మీదేవికి గాయాలయ్యాయన్నారు. చికిత్స నిమిత్తం బనగానపల్లె ప్రభుత్వ ఆసుపత్రికి తరలించామని చెప్పారు.

విధుల్లో చేరిన సీఐ

కర్నూలు : కర్నూలు తాలూకా రూరల్ పీఎస్ సీఐగా నియమితులైన వి.కిరణ్‌కుమార్‌రెడ్డి ఆదివారం విధుల్లో చేరారు. ఇక్కడున్న శ్రీనివాసరెడ్డి వీఆర్‌కు బదిలీ అయ్యారు. కడప జిల్లా ఎర్రగుంట్ల గ్రామానికి చెందిన కిరణ్‌కుమార్‌రెడ్డి 2007లో ఎస్‌ఐ హోదాలో పోలీసు శాఖలో చేరారు. ఈయన సర్వీసు మొత్తం అనంతపురం జిల్లాలో విధులు నిర్వహించారు. పామిడిలో విధులు నిర్వహిస్తున్న ఈయనను కర్నూలు రూరల్ తాలూకా సీఐగా నియమిస్తూ కర్నూలు రేంజ్ డీఐజీ సెంథిల్‌కుమార్ ఉత్తర్వులు జారీ చేయడంతో విధుల్లో చేరారు. అనంతరం మర్యాదపూర్వకంగా ఆయన ఉన్నతాధికారులను కలిశారు.